

# వాసంతి

**వాసంతికీ,** మనోహర్‌కూ పరిచయమైన విధం అపూర్వం.

మనోహర్ ధనవంతుని కుమారుడైనా ఏలూరులో కుటుంబంతో కలిసి నివసించడం లేదు. తల్లి చనిపోయిన వెనుక తండ్రి ఒక్క భోగస్త్రీ మాయలోపడి ఆస్తిని దుర్వినియోగం చేస్తుంటే, మేనమామ పేచీపెట్టి కోర్టుక్కు ఎక్కుతానని భయపెట్టి మధ్యవర్తుల సహాయంతో మిగిలిన ఆస్తిలో సగం మనోహర్‌క్కు పంచిపెట్టేటట్లు చేశాడు. ఇంత కష్టపడడానికి కారణం లేకపోలేదు. తన కూతురినిచ్చి వివాహం చేద్దామనుకున్నాడు. కాని మనోహర్‌కు పెండ్లి మాటే నచ్చలేదు. తన జీవితమంతా చిత్రకళకే ధారపోయాలని సంకల్పించుకున్నాడు. మద్రాసులో దేవీప్రసాద్ రాయ్‌చౌధురి దగ్గర మూడు సంవత్సరాలు చిత్రకళ నేర్చుకున్నాడు. అతని సహవాసంవల్ల సహజంగా ఉన్న సౌందర్య పిపాస ద్విగుణీకృతం అయింది. ఏలూరులో వాతావరణం అనుకూలంగా ఉండదని హైదరా-

లోకం పలురకాల మన స్తత్వాల నిక్షేపం. పరిచయమైన వివిధ ప్రవృత్తులే జీవితం నేర్పే పాఠాలు. మనిషి మనసును చదవగలగటం కష్టసాధ్యం. ఒకొక్క పరిస్థితి ఒకొక్క విధంగా అర్థం చెబుతుంది. సరిఅయిన అవగాహన ఉంటే జీవితం సుఖప్రదమే అవుతుంది. కాని సాధారణంగా దానిని గ్రహించే లోపునే జీవితం అనుకోని మలుపు తిరుగుతుంది.

# వాసంతి

బాదులో ఒక ఇంట్లో మేడమీద భాగంలో నివాసం ఏర్పరుచుకున్నాడు. రెండు గదులు చేరిన వరండా, అందులో ఒకమూల స్నానాల గది. వంటగది ప్రత్యేకంగా పైనలేదు. కింద భాగంలో ఒకటి ఉంది గానీ, మనోహర్‌కు హోటల్ భోజనమే కావడంచేత దాన్ని ఉపయోగించడంలేదు. ఒక నౌకరును కుదుర్చుకున్నాడు—భోజనం, టిఫిన్, కాఫీ హోటల్‌నుంచి తేవడం, గదులు శుభ్రం చేయడం, స్నానానికి నీళ్ళు కాగబెట్టడం, దుకాణాలకు వెళ్ళిరావడం మొదలైన పనులకు. పేరు రాముడు. వాడు కింద వంట గదిలో పడుకుంటాడు.

మనోహర్ హైదరాబాదు వచ్చి రెండేళ్ళయింది. చిత్రాలు గీస్తూ వచ్చాడు. 'లలిత కళా నికేతనం' అనే సంఘంలో సభ్యుడయ్యాడు. అందులో సభ్యులు కళాకారులు, కళలంటే అభిరుచి కలవారు. ప్రతి సంవత్సరం సంఘం ఒక లలితకళా ప్రదర్శనం జరిపిస్తుంది. ఆ ప్రదర్శనాలలో మనోహర్ చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. విమర్శకులు అతని రేఖా నైపుణ్యాన్ని, వర్ణ సమ్మేళనాన్ని మెచ్చుకున్నారు. కొన్ని బొమ్మలు అమ్ముడు పోయాయి కాని, మనోహర్ ఆ పైకాన్ని సంఘానికి ఇచ్చివేశాడు. సభ్యులలో యువతీ యువకులందరికీ మనోహర్ అంటే ఇష్టం—అందరితో కలిసి మెలిసి ఉంటాడనీ, నిగర్వి అనీ, ఆర్ద్ర హృదయుడనీ, అందగాడనీ కూడా.

మనోహర్‌కు మాత్రం తృప్తిలేదు. చిత్ర కళలో ఉన్నత స్థానానికి ఇంకా రాలేదని అతని చింత. తన కలల్లో నిండిన సౌందర్య లక్ష్మి పటాలలో వ్యక్తం కావడంలేదు. కుమార సంభవంలో కాళిదాసు వర్ణించిన వసంత ఋతు శోభ మూర్తీభవించిన యువతిని చిత్రించాలని అతని కాంక్ష. రాజపుత్ర చిత్రాలలో ఉన్న లావణ్యాన్ని ఆధునిక జీవితంలో ప్రదర్శించాలని అతని వాంఛ. సభ్యులలో కొందరు యువతులు అతనికి సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నట్లు సూచించారు. సరేనని వారిని ఆధారంగా తీసుకొని కొన్ని బొమ్మలు చిత్రించాడు కానీ, తన కోరిక సఫలం కాలేదు. వాళ్ళ కృత్రిమ సౌందర్యం ప్రకృతి సౌభాగ్యాన్ని ప్రతిబింబించలేదు.

ఆ రాత్రి భోజనానంతరం తన గదిలో గోడలకు తగిలించిన పటాలను, మేజా డ్రాయర్లో ఉంచిన బొమ్మలను పరీక్షించి చూడసాగాడు. విజయ, సౌదామిని, వైదేహి, స్వర్ణ—అందరూ ఉన్నారు ఆ చిత్ర పటాల్లో. కాని, ప్రయోజనంలేదు. తన కళాదర్శానికి ఎవ్వరూ ఉపకరించరు. అంతే. అంతే. అంతా వృథా.

విసుగుతో సిగరెట్ వెలిగించి వరండాలో పచారుచేస్తూ అప్పుడప్పుడు వీధిలోకి చూస్తూ, మళ్ళీ ఆకాశం చూస్తూ విరాళా జలధిలో మునిగిపోయాడు.

ఎవరది? ఒక యువతి ఆ విధంగా వీధిలో పరుగెత్తుకుంటూ వెళ్ళుతున్నది రాత్రివేళ, ఒంటరిగా? ఎవరైనా వెంబడిస్తున్నారేమో అని చూశాడు. లేదు. అయ్యో! కాళ్ళు తడబడి కింద పడింది. తన ఇంటిముందే. పాపం! త్వరగా మెట్లు దిగి దగ్గరకు వెళ్ళి లేవనెత్తాడు. ఒక్క క్షణం సందేహం కలిగింది, ఏదైనా నేరంచేసి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నదేమో అని. కానీ ఆ సగం వెలుతురులో ఆమె ముఖం చూడగానే అటువంటి సందేహాలు మాయమైనాయి. మెల్లగా నడిపిస్తూ మేడమీదికి తీసుకొని వెళ్ళాడు.

"అదిగో, బాత్‌రూమ్. ముఖం కడుక్కొని రండి. వేడి టీ ఇస్తాను.'

ఆమె ఇంత కరుణాయుతమైన వాక్యాలు ఎప్పుడూ వినలేదు. చెప్పినట్లే వెళ్ళి ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చింది.

గదిలోకి తీసుకొనివెళ్ళి కుర్చీమీద కూర్చోమన్నాడు. ఫ్లాస్క్‌లోనుంచి ఒక కప్పు టీ వంచి అందించాడు. గబగబా తాగేసింది. సత్తువ చేరుకుంది. కృతజ్ఞతతో నమస్కరించి "భగవంతుడే మీ రూపంలో నన్ను రక్షించాడు" అన్నది.

మనోహర్ ఆమె మాటలు వినడంలేదు, పూర్తిగా. ఆమె వదనారవిందాన్ని, అవయవ సౌభాగ్యాన్ని తిలకిస్తున్నాడు, చిత్రకారుని దృష్టితో. నిస్సంశయంగా తన స్వప్నసుందరి ఈమే! విధి తన కళావికాసానికి ప్రోద్బలంగా ఈమెను పంపింది. నిజం! అయితే, అయితే—ఈమె తన కళకు దోహదం ఇస్తుందో; లేక తెల్లవారగానే అదృశ్యమైపోతుందో? కాదు కాదు. కోరిక నమ్మకానికి ఆధారమైంది. ఏమో చెప్పబోతున్నది. ఏమి మధురస్వరం! మాట్లాడుతుంటే ఆ పెదవుల కదలిక ఎంత అందంగా ఉంది!

"నా కథ మీ కడగలేదు. ఇది మీ కౌతూహల్ని

**రేవనూరు శమంత**

పెల్లడిస్తున్నది. కాని మీరడగకున్నా చెప్పడం నా విధి. నేనొక అనాథను. పేరు వాసంతి. తల్లిదండ్రులను బాల్యంలోనే కోల్పోయిన అభాగ్యను. మేనమామ పెంచి పెద చేసి చదువు చెప్పించారు. జీవనోపాధికి పనికివస్తుందని షార్టుహాండు, టైపు నేర్చుకొని పరీక్షలు పాసైనాను. బెజవాడలో, గుంటూరులో కొన్ని కంపెనీలలో గుమాస్తాగా పని చేశాను. గుంటూరులో పనిచేసిన కంపెనీకి హెడ్ ఆఫీసు ఈ ఊళ్ళో ఉంది. కంపెనీ పెద్ద మేనేజర్ గుజరాతీ వ్యక్తి. ఒకసారి గుంటూరు వచ్చాడు, అక్కడ ఆఫీసును తనిఖీ చెయ్యడానికి. అప్పుడు నన్ను చూచాడు. ఉత్తరాలు, నోట్సు నేనే టైపు చేశాను. అతను వెళ్ళిపోయిన ఒక వారంలో అతని సెక్రటరీగా ఉద్యోగం ఇప్పించాడు, ఎక్కువ జీతంమీద. ఆయన బంగళాకు రోజూ పొద్దున, సాయంత్రం వెళ్ళాలి. మధ్యాహ్నం ఆఫీసులో పని. ఆయన భార్య పొట్టిగా, లావుగా ఉండేది. మంచి రంగైనా అవయవాలు బాగుండవు. ఆవిడ బొంబాయిలో ఒక లక్షాధికారి కూతురు. మామగారి డబ్బుతోనే ఆయన వ్యాపారం వృద్ధిచేసుకున్నాడు. అందుచేత అతనికి భార్య అంటే గౌరవం. ఆమె గుణవతి. ఆమె శీలం అకళంకమైనది. అందుచేత అతనికి ఆవిడంటే భయం. అతనికి మద్యపాన వ్యసనం ఉండేది. నాకు తెలుసు. స్త్రీ లోలుడని కూడా అనుకొనేవారు. ఈ వ్యసనాల సంగతి ఆమెకు తెలియదు. లేదా, తెలిసీ, తెలియనట్లు ఉండేదేమో! అతని గుణగణాలతో నాకేంపని—అని నా ఉద్యోగధర్మం నేను నెరవేర్చుకుంటూ ఉండేదాన్ని. కొంతకాలం అంతా సవ్యంగానే నడిచింది. ఆమె గర్భవతి అయి, కాన్పుకోసం బొంబాయి వెళ్ళింది, అమ్మగారింటికి. ఆమె వెళ్ళినతర్వాత కూడా యథా ప్రకారం ఉదయం, సాయంత్రం బంగళాకు వెళ్ళుతుండేదాన్ని. ఆశ్చర్యంగా, అతని వైఖరి మారింది. సాయంత్రం నాకు ఉత్తరాలు చెబుతూ మేజామీద గ్లాసుఉంచి, అప్పుడప్పుడు తాగుతుండేవాడు. వాసనవల్ల మద్యమని ఊహించాను. కాని నేనేం చేయగలను? యజమాని చర్యలను ఆక్షేపించడానికి నౌకరుకు అధికారం ఏముంటుంది? విసిగిస్తున్నానా? ఆఖరి ఘట్టానికి వచ్చాను లెండి."

"లేదు లేదు. సావధానంగా వింటున్నాను."

"ఈ విధంగా రెండు రోజులు. మూడవ రోజు సాయంత్రం ఆయన ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. ప్రవేశించగానే దుర్వాసన. లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకొని వచ్చాడు. నవ్వుతూ దగ్గరగా చూస్తూ 'వాసంతీ, జరుగుదైన ఉత్తరాలు చెప్పాలి. ఇక్కడే నీకు భోజనం ఏర్పాటు చేశాను. ఆలస్యమైతే ఇక్కడే పడుకోవచ్చు' అన్నాడు. నా కేదో అవ్యక్తమైన భీతి కలిగింది. అతను నన్నెప్పుడూ పేరుపెట్టి పిలిచిందిలేదు. తన ఇంట్లో భోజనం చెయ్యమన్నదీ లేదు.

"ఎందుకండీ? మీ పని అంతా ముగిసిన తరువాతనే వెళ్తాను' అన్నాను.

"తొమ్మిది దాటితే హోటల్లో భోజనం దొరకదు. అందుకని అన్నాను. ఒంటరిగా ఇక్కడ పడుకోవడానికి ఇష్టంలేకపోతే, పోనీ.....' అని వికటంగా నవ్వాడు.

"ఒక సీసా, గ్లాసూ, సోడా తీసుకొనివచ్చి మేజామీద ఉంచాడు. సీసామీద విస్కీ అని ఉంది. ఏదో పేరు. సగం గ్లాసుకు పోసుకొని సోడా కొంచెం కలుపుకొని గబగబా తాగేశాడు. 'అలవాటుందా' అని అడిగాడు. 'లే'దనన్నాను. నవ్వాడు. మేజా డ్రాయర్లోనుంచి ఒక సెంటు బాటిల్, పౌడరు డబ్బా తీసి నాముందు ఉంచి 'లోపలికి వెళ్తే! వంటవాడు వడ్డిస్తాడు. భోజనంచేసి, ముఖం కడుక్కొని ముస్తాబు చేసుకుని రా' అన్నాడు. లోపలికి వెళ్ళి నాలుగు మెతుకులు తినివచ్చాను. సెంటు, పౌడరు ముట్టలేదు. నేను వచ్చేటప్పటికి సీసా సగం ఖాళీ అయింది. నౌఖరును పిలిచి వాడికొక రూపాయిచ్చి 'సినిమాకు వెళ్ళి రారా' అని పంపేశాడు. వీధి తలుపువేసి తూలుతూ ఆఫీసు గదిలోకి వచ్చాడు. 'జరుగురు ఉత్తరాలు చెప్పాలన్నారే' అన్నాను. 'నీవు శుద్ధ అమాయకురాలవు, వాసంతీ! నిన్ను గుంటూరులో చూచినప్పటి నుంచి నీమీదే నా మనసు. అమ్మగారు ఉండడం చేత వీలుపడలేదు'—అంటూ మళ్ళీ గ్లాసులో విస్కీ వంచుకొని సోడా కలపకుండానే తాగాడు. మాటలు తడబడ సాగాయి.

"అతని ఉద్దేశం స్పష్టం కాగానే నన్ను భయం ఆవరించింది. కాని తక్షణమే ఆ కామ పిశాచం బారినుంచి తప్పించుకోవాలనే దృఢ సంకల్పం కలిగింది. అప్పుడు స్త్రీకి సహజమైన సమయస్ఫూర్తి నాకు సహాయపడింది. అతను అప్పటికే ఉన్న స్థితిలో ఇంక కొంచెం తాగిస్తే స్మరణ లేకుండా పడిపోతాడని ఊహించాను. లేని సంతోషం అభినయిస్తూ 'మీ ఇష్టమే నా ఇష్ట'మని చెప్పి గ్లాసులో సగానికి ఎక్కువగా మద్యం వంచి అతనికి అందిచ్చాను. ఆనందంతో పుచ్చుకొని గడగడా తాగి లేచి నా దగ్గరికి రాబోయి తూలి కుర్చీ తగిలి బోర్లా పడ్డాడు. అదే మంచి తరుణమని క్షణంలో గది వదిలి హాలు తలుపు గడియ తీసుకొని వీధి చేరాను. అప్పటికి నా ధైర్యం సన్నగిల్లింది. పరుగు ప్రారంభించాను. ఎక్కడికి అని ఆలోచించలేదు. ఎన్ని వీధులు దాటానో తెలియదు. అలిసిపోవడంచేత పాదాల్లో శక్తి తగ్గిపో జొచ్చింది. తల తిరుగుతున్నది. ఆఖరికి మీ ఇంటిముందు పడిపోయాను. మీరు దయతో నాకు ఆశ్రయం ఇచ్చారు. ఇదీ నా కథ''—అని ముఖం చేతులతో కప్పుకొంది ఆమె.

మనోహర్ ఇంతవరకూ చెవులతో వింటూ ఉన్నా, కండ్లతో ఆమె సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఆమె కష్టం చూచి జాలిపడ్డాడు.

"దుఃఖపడకండి. చాలా అలిసిపోయారు. ఈ రాత్రి ఇక్కడే పడుకోండి. మిగతా విషయాలు రేపు మాట్లాడుకుందాము. అన్నట్లు నా కథ చెప్పలేదు. నా పేరు మనోహర్.''

ముఖంమీదనుంచి చేతులు తీసి అతణ్ణి చూచింది. 'మనోహర్! నిజంగా సార్థక నామం!' అనుకొంది.

"నే నొక చిత్రకారుణ్ణి. చిత్రకళే నా జీవితం, నా దైవం. నేనూ, నా నౌఖరు. ఇంకెవ్వరూ లేరు. మీకు అభ్యంతరం లేకపోతే ఈ రాత్రి ఇక్కడే పడుకోండి. భయంలేదు'' అని మెల్లగా నవ్వాడు మనోహర్.

వాసంతి చిరునవ్వు నవ్వి "నాకేమీ భయం లేదు. కానీ, మీ కెంత శ్రమ! నేనా వరండాలో పడుకుంటాను'' అంది.

"తెల్లవారేసరికి చలితో బిగిసిపోతారు. నా మాట వినండి. అదిగో పడక గది. ఆ మంచం మీద పడుకోండి. శాంతంగా నిద్రపోండి. నేనీ గదిలో సోఫామీద పడుకుంటాను. నాకు అల వాటే.''

"వద్దు వద్దు. నేనే ఇక్కడ పడుకుంటాను.''

"దైవవశాత్తు ఇప్పుడే మనం కలిశాము. ఇంతలోనే వాదంవద్దు. నేను చెప్పిన మాట వినండి'' అని తన పడకగది తలుపుతీసి దారి చూపించాడు మనోహర్. వాసంతి మారు పలకకుండా లోపలికి వెళ్ళి తలుపు మూసింది.

"గడియ వేసుకోండి.'' నవ్వుతూ అన్నాడు మనోహర్. లోపలినుంచి వాసంతి కిలకిల మని నవ్వింది. ఆ నవ్వు మనోహర్ చెవులకు సెలయేటి పాటను పోలినట్లు తోచింది.

మనోహర్ దీపం ఆర్పి సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు. సినిమాల్లో, నవలలలో ఇటువంటి ఘట్టాలు ఉంటాయి. కాని యథార్థ జీవితంలో, అందులో తనకు, ఆ విధంగా సంభవిస్తుందని కలలోకూడా అనుకోలేదు. తానారాధించిన కళాదేవతే ఈమెను తనవద్దకు పంపింది కాబోలు!



స్వగతం

కత్తిరింపు చిత్రం—ఎ ఆర్. మోహన్
(కాకినాడ-1)

కళాకారుల చిత్తవృత్తి విచిత్రమైంది. ఒక చిన్న విషయం వారి మనసును కలిచివేయగలదు. ఒక పలుకు, ఒక చూపు వాళ్ళను ఆనంద శిఖరానికి తీసుకొనిపోగలదు. ఉత్సాహ కారణం లేకపోతే వారి సృష్టి సాగదు. సహజమైన ప్రతిభ ప్రజ్వలించటానికి అగ్నికణం ఏదైనా ఆవశ్యకం.

తన శక్తిని తానే అనుమానించే దుస్థితిలో పడ్డ మనోహర్‌కు హఠాత్తుగా ఉత్సాహం కలిగింది. వాసంతి రావటమే దానికి కారణం. ఏ విధంగా ఆమె తన కళావికాసానికి తోడ్పడగలదో, విశదంగా ఊహించలేదు. కాని తప్పక అలా జరుగుతుందని మాత్రం నిశ్చయించుకున్నాడు. వాసంతికి ఎవ్వరూ లేరు. తనతో ఎందుకు ఉండిపోరాదు? ఏమో! వెళ్ళిపోతానంటే ఎలా బలవంతంగా అడ్డు పెట్టగలడు? లేదు లేదు. వెళ్ళిపోదు.

సిగరెట్ ఆర్పి సోఫాలోనే పడుకొని కొంత సేపటికి నిద్రపోయాడు.

బాల భాస్కరుని స్వర్ణకిరణాలు కిటికీనుండి ముఖంపైన పడినా మనోహర్ మేలుకోలేదు. నౌఖరు వచ్చి ఆశ్చర్యంతో పలకరించాడు—"ఏమండోయ్'' అని. ఉలికిపడి లేచాడు మనోహర్. నౌఖరు అడగకపోయినా తానక్కడ పడుకోవడానికి ఏదో కారణం చెప్పక తప్పదని ఆలోచించి "రాముడూ, నిన్న రాత్రి మావాళ్ళ అమ్మాయి బెజవాడనుంచి వచ్చింది. పాపం, ఇల్లు తెలుసుకోలేక చాలా ఆలస్యమైంది. ఆ గదిలో పడుకొంది. నీవు వెళ్ళి ఫ్లాస్కులో రెండు కప్పులు కాఫీ పట్టుకొని రా. పెసరట్టు ఉప్మా రెండు ప్లేట్లు కూడా'' అని చెప్పి పర్సు తీసి రూపాయ ఇచ్చాడు. రాముడికి ఈ కథ వింతగా ఉన్నా మన కెందుకని వెళ్ళాడు.

'వాసంతి ఇంకా లేచినట్లు లేదు' అనుకుని పడక గది తలుపు తట్టాడు. తలుపు కదిలి సగం తెరిచినట్లయింది. 'అరే! గడియ వేసుకోనేలేదు. ఎంత విశ్వాసం!' అని సంతోషించాడు. తొంగి చూచాడు. వాసంతి ప్రశాంతంగా నిద్రిస్తున్నది. 'ఏమి, ఈ అకళంకమైన సహజ సౌందర్యం! ఆ విశాల ఫాల భాగంపైన ముంగురులు. ఆ తీర్చిన ముక్కు, ఆ లేత గులాబీ రేకుల్లాంటి పెదవులు! ఇటువంటి లావణ్యానికి కృత్రిమాలంకారాలు ఎందుకు?' అనుకుంటూ మేల్కొలపడం ఎలా—అని తలుపును చేతితో తట్టాడు గట్టిగా. ఆ శబ్దానికి వాసంతి కండ్లు తెరిచింది.

(సశేషం)